క్లుప్తంగా

ఫ్రిజ్ దగ్ధం


దగ్ధమైన ఫ్రిజ్

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలోని ఆత్రం నవీన్‌కు చెందిన కిరాణ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం ఫ్రిజ్ దగ్ధమైంది. స్థానిక సర్పంచ్ అన్నిగ బాధితుడిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. రూ.40 నుంచి 50 వేల వరకు నష్టంవాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

పంచాయతీ భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి: మండలంలోని జైత్‌పూర్ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల నుంచి రూ.20 లక్షలతో భవనం నిర్మించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పెంటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం


సర్పంచులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచుల పదవీ కాలం త్వరలో ముగియనున్న సందర్భంగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు చేసిన సేవలను కొనియాడారు. ఎంపీపీ మల్లికార్జున్, ఎంపీడీవో శశికళ, సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్, ఎంపీవో ప్రసాద్, ఏపీవో చంద్రశేఖర్, సర్పంచులు వినోద్, బాపురావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీల సమస్యలపై పోరాటం

తిర్యాణి: ఆదివాసీల సమస్యలపై తుడుందెబ్బ పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో గురువారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోడసం భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రాయిసిడం వినోద్, ఉపాధ్యక్షులుగా జంగు, అంబారావు, గుండం వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా గెడం సోనెరావు, ప్రచార కార్యదర్శిగా దశ్వంత్‌రావుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు, డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాశ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రెబ్బెన: విద్యార్థులు సరైన పౌష్టికాహారం తీసుకుంటే ఎనిమియా నుంచి రక్షణ పొందవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎనిమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 8 నుంచి ఇంటర్ వరకు 100 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. హెచ్ఎం విజయరాణి, ఉపాధ్యాయులు మేడి చరణ్‌దాస్, తుకారాం, వైద్య సిబ్బంది సాగర్, శాంతారాణి, వనిత, ఇస్తేరా, సరోజ పాల్గొన్నారు.

జెండా పండుగ కోసం ఏర్పాట్లు


ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

రెబ్బెన: గణతంత్ర వేడుకల కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. గురువారం సాయంత్రం సిబ్బంది జాతీయ జెండాల గద్దెలను సిద్ధం చేయడంతోపాటు గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు రంగురంగుల పేపర్ల, తోరణాలు ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి ప్రణాళికలు

- గ్రామసభల్లో ఆమోదం
- ఈనెల 27లోగా సభల నిర్వహణ
- ప్రత్యేకంగా తొమ్మిది అంశాలు


కౌటాలలో గ్రామాభివృద్ధి ప్రణాళిక గ్రామసభ

కౌటాల: జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభివృద్ధికి ప్రణాళికలకు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకుగాను గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతారు. ఏఏ మార్గాల ద్వారా ఆదాయం వస్తుంది..? ఎలాంటి పనులకు ఖర్చు చేస్తారనే వివరాలతో ప్రణాళికలు సిద్ధం చేసి పంపించాలని కేంద్రం నిబంధన పెట్టింది. అందులో భాగంగానే గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

ప్రధానంగా తొమ్మిది అంశాలు

గ్రామాభివృద్ధి ప్రణాళికలో కేంద్రం ప్రధానంగా తొమ్మిది అంశాలను ప్రవేశ పెట్టింది. మెరుగైన జీవనోపాధి, పచ్చదనం–పరిశుభ్రత, పంచాయతీలకు సరిపడా నీరు, స్వయం సమృద్ధి, సామాజిక భద్రత, అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు, బాలల మధ్య స్నేహపూర్వక కార్యక్రమాలు, మహిళా సాధికారత, పంచాయతీలో సుపరిపాలన, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలకు ప్రధానం ఇచ్చింది. ఇందులో జీపీలకు అవసరమైన ఏవైనా రెండు అంశాలు తీసుకుని ప్రత్యేకంగా బడ్జెట్ రూపొందించుకోవాలి. గ్రామాల్లో పనిచేస్తున్న 29 శాఖలను సమన్వయం చేసుకుని గ్రామసభలు పూర్తిచేయాలి. ఎలాంటి పనులు కావాలి, నిధుల అంచనా, మంజూరుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలి.

31లోగా ఆన్‌లైన్

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల ఆదాయ, వ్యయాలపై వివరాలు సేకరిస్తారు. వచ్చిన నిధులను 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏఏ పనులకు ఖర్చు చేస్తారో తెలుసుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అయితే వచ్చే ఆదాయాన్ని బట్టి ఆయా గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, ఉపాధి పనులతోపాటు ఇతర వాటి కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ అభివృద్ధి ప్రణాళికలో పొందుపర్చిన విధంగానే ఆయా పంచాయతీలు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈనెల 27లోగా గ్రామసభలు పూర్తిచేసిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తారు. 31లోగా ప్రణాళికలను గ్రామాల వారీగా 'ఈ–గ్రామ స్వరాజ్'పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చనున్నారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అధికారులు ఆదేశించడంతో కార్యదర్శులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మూడు స్థాయిల్లో..

గ్రామాభివృద్ధికి ప్రణాళిక రూపొందించడానికి గ్రామస్థాయిలో కార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించి గ్రామసభలో అభివృద్ధి పనుల ప్రణాళికను రూపొందించడంలో కీలకపాత్ర పోషిస్తారు. అనంతరం బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(బీపీడీపీ)కు నోడల్ అధికారిగా ఎంపీడీవో ఉంటారు. మండలస్థాయి అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. శాఖల అధికారులను సమన్వయం చేసుకుని నిధులు కేటాయించాలి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఫిబ్రవరి 7వ తేదీ వరకు ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశం నిర్వహించి అభివృద్ధి ప్రణాళికను ఆమోదించుకోవాల్సి ఉంటుంది. 10వ తేదీ నాటికి ఈ– గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి. ఆ తర్వాత జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(డీపీడీపీ)కు జెడ్పీసీఈవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. గ్రామ, మండల స్థాయి తరహాలో జిల్లాస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలి. అనంతరం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించి ఆమోదించుకోవాలి. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. పూర్తి వివరాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది.

> **గడువులోగా పూర్తి చేయాలి**
>
> అభివృద్ధి ప్రణాళిక తయారీలో నిర్లక్ష్యం వద్దు. ఇటీవల అధికారులకు సమావేశం నిర్వహించి ఆదేశాలు ఇచ్చాం. పకడ్బందీగా గ్రామసభలు నిర్వహించి కార్యదర్శులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్ పూర్తి చేయాలి. ఫిబ్రవరి 7లోగా మండల స్థాయి సభలు నిర్వహించి 10లోగా ఆన్‌లైన్ పూర్తి చేయాలి. తర్వాత జిల్లాస్థాయిలో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం.
>
> – ఉమర్ హుస్సేన్, జిల్లా పంచాయతీ అధికారి

ఆయుర్వేద వైద్యశిబిరం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం: ఆయుర్వేద వైద్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో ఉచిత స్వర్ణామృత ప్రాశన ఆయుర్వేద వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, ఎంపీటీసీ జయలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, ఆయుర్వేద వైద్య నిపుణులు బుజాడి లక్ష్మయ్య, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

నార్నూర్: ప్రజలందరికీ అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మాన్కాపూర్‌లో ఏర్పాటుచేసిన డిజిటల్ పార్క్, క్రీడా ప్రాంగణాన్ని ఆమె ప్రారంభించారు. డిజిటల్ పార్క్, క్రీడా ప్రాంగణాన్ని నిర్మించిన సర్పంచ్ రాథోడ్ సావిందర్‌ను ఆమె అభినందించారు. గ్రామంలో ఐక్యత సోదర భావం ఉంటే ఎటువంటి అభివృద్ధి అయినా సాధ్యమవుతుందన్నారు. మాన్కాపూర్ చెరువు కెనాల్‌ను సీసీతో నిర్మించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తానన్నారు. గ్రామ పటేల్ మెస్రం రూప్ దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగరావ్, ఎంపీడీవో రమేశ్, రాథోడ్ సునీల్, సర్పంచులు బానోత్ గజానాయక్, రాథోడ్ విష్ణు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


చెక్కులు అందజేస్తున్న అటవీ అధికారులు

సిర్పూర్(టి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని సిర్పూర్(టి) అటవీశాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్ అన్నారు. మండలకేంద్రంలోని అటవీశాఖ సిర్పూర్(టి) రేంజ్ అధికారి కార్యాలయంలో రేంజ్ పరిధిలోని అటవీప్రాంతాల్లో వన్యప్రాణుల దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు గురువారం నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. రేంజ్ పరిధిలోని గ్రామాలకు చెందిన పశువుల యజమానులకు 25 చెక్కులు, మొత్తం రూ.5లక్షల 40వేల చెక్కులు అందించినట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రమేశ్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో మహేందర్, విద్యుత్ శాఖ ఏఈ ఇర్ఫాన్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎఫ్ఎస్‌వోలు మోహన్, సర్పంచ్ పిప్రె ప్రభాకర్, సద్దాం, నాయకులు సుర్పంచ్ అర్జు, నర్గేవార్ రాజు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

ఆసిఫాబాద్‌రూరల్: డీఈ ఇంటి పనులు చేస్తున్నారని చేయకుంటే విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని గురువారం భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో కార్మికులు తెలిపారు. మానిక్‌గూడ నీటి శుద్ధి కేంద్రం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. వేణు, శిరీష, మహేశ్, సాయి కిరణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గృహాలు కొందరికే..!


నిర్మాణంలో పక్కాగృహాలు

- 15 కుటుంబాలకు..5 మంజూరు
- మిగతా వారిలో ఆందోళన
- ఇదీ పాట్నాపూర్(బి) గ్రామ పరిస్థితి

వారంతా ఆదివాసీలు.. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు. వారికి సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. అందరికి కాదు కొందరికే వసతులు కల్పించి చేతులు దులుపుకొంటున్నారు. సరైన విద్యుత్, తాగు నీరు సౌకర్యం లేదు. ఉండేందుకు పక్కా గృహాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

కెరమెరి: అధికారుల నిర్లక్ష్యం ఆదివాసీ గిరిజనులకు శాపమవుతుంది. గ్రామంలో అందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాల్సి ఉన్నా కొందరికి మంజూరు చేసి ఐటీడీఏ అధికారులు చేతులుదులుపుకొన్నారు. ఫలితంగా మిగిలిన వారందరికీ ప్రభుత్వ గృహాలు మంజూరు కాకపోవడంతో కొందరు పూరిళ్లు, మరికొందరు పెంకుటిళ్లు, రేకుల ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ఇది కెరమెరి మండలంలోని జోడేఘాట్ పంచాయతీలోని పాట్నాపూర్(బి) గ్రామ దుస్థితి. ఆ గ్రామంలో మొత్తం 15 కుటుంబాలు ఉండగా..84 మంది నివసిస్తున్నారు.

కొందరికే సంతోషం

15 కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలో కేవలం ఐదుగురికి 5 పీఎంజేఎస్‌వై పథకంలో గృహాలు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.2.40 లక్షలు. అందరూ ఇళ్ల కోసం ఐటీడీఏలో దరఖాస్తు చేసుకున్నారు. కాని కేవలం ఐదుగురికే మంజూరు కావడంతో మిగిలిన వారు నిరుత్సాహంలో ఉన్నారు. చాలామందికి సరైన గృహాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

బల్బులకే పరిమితం

ప్రస్తుత ఆ గ్రామంలో ఐటీడీఏ అధికారులు అందజేసిన సోలార్ లైట్లు ఉన్నాయి. కాని దాని పవర్ సరిపోవడం లేదు. కేవలం రెండు బల్బులు మాత్రమే నడుస్తున్నాయి. ఫ్యాన్లు ఇతరత్రా విద్యుత్ పరికరాలు పనిచేయవు. విద్యుత్ ఉన్నప్పటికి ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియదు. అలాగే అక్కడ ఒకటే చేతిపంపు ఉంది. మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికి రంగుమారి వస్తుంది. తాగేందుకు వినియోగించడం లేదు. వాటర్ ట్యాంక్ 5 వేల లీటర్లకు పరిమాణంలో ఉండడంతో నీరు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని అక్కడి ఆదివాసీలు కోరుతున్నారు.


గ్రామంలో వాటర్ ట్యాంకు

> **త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి**
>
> 
>
> గ్రామంలో ఉన్న వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలి. తాగునీటి వసతి కల్పించాలి. నల్లాలు అమర్చాలి. చిన్న నీటి ట్యాంకు ఉండడంతో నీరు సరిపోవడం లేదు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి.
>
> – సోని బాయి, సర్పంచ్, జోడేఘాట్

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: కేంద్ర పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కోరారు. మండల కేంద్రంలోని సిద్దార్థ హెచ్‌పీ గ్యాస్ఏజెన్సీలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద లబ్ధిదారులకు గురువారం ఆయన ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, గ్యాస్‌డీలర్ దుర్గం జానకీరామ్ పాల్గొన్నారు.

- గుండాయిపేట్‌లో గురువారం నిర్వహించిన కొండయ్య మహారాజ్ గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. అదేవిధంగా తలోడి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్‌ను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు వానుపటేల్ ఉన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం 25 మంది లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందించారు. హెచ్‌పీ గ్యాస్ డీలర్ ఖుర్షీద్ హుస్సేన్, నాయకులు నీరటి సత్యనారాయణ, నానయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం


సిర్పూర్(టి): బస్టాండ్ చౌరస్తా వద్ద మానవహారం

దహెగాం: జిల్లావ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీలు చేపట్టారు. దహెగాంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు మానవహారంగా ఏర్పడ్డారు. అందరితో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైందన్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కవిత, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీనియర్ సిటిజన్లు, తొలిసారి ఓటు హక్కు పొందిన వారిని తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీపీ ముండె విమలాబాయి, తదితరులు కలిసి సన్మానించారు. సర్పంచ్ తుకారాం, కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రయ్య, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గంగాసింగ్, హెచ్ఎం విజయనిర్మల, ఏఎస్సై ప్రభాకర్, లోడుపల్లి సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ ప్రాంతం మీదుగా పలు పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలోని చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేశ్వర్, ఆర్ఐ ముబిన్, అదనపు ఎస్సై భోజిరావ్ పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని తహసీల్దార్ సమీర్ హైమద్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లు, వికలాంగ ఓటర్లను సన్మానించారు. ఆర్ఐ ప్రేం కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో ఓటరు అవగాహన ర్యాలీలను నిర్వహించారు. లేతన్‌గూడ పాఠశాల విద్యార్థులు ఇందిరానగర్‌లో ర్యాలీ నిర్వహించగా, పులికుంటకాలనీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎంలు రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ప్రిన్సిపాల్ రాందాస్, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌటాల: తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జాతీయ ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎస్సై మధుకర్, డీటీ రవీందర్, ఆర్ఐ దిలీప్, దేవేందర్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కార్యదర్శి సాయికృష్ణ, హెచ్ఎం నారాయణ్‌సింఘ్, అధ్యాపకులు పాల్గొన్నారు.


వాంకిడి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

కౌటాల(కాగజ్‌నగర్): కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు టేమాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంతో పాటు జామిని మండల పరిషత్ పాఠశాలలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఆర్ఐ సుధాకర్, విద్యార్థులు ఉన్నారు.


కౌటాల: ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, అధికారులు


పెంచికల్‌పేట్‌లో ర్యాలీ..


దహెగాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు


దహెగాం మానవహారంగా విద్యార్థులు


రెబ్బెన: సన్మానిస్తున్న తహసీల్దార్ సమీర్ హైమద్


ఆసిఫాబాద్‌రూరల్: మానవహారంగా విద్యార్థులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సారంగపాణి అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీవో 51ని వెంటనే రద్దు చేయాలన్నారు. పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు నరేశ్, రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రెబ్బెన: గోలేటిలోని వారసంతలో గురువారం సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యువకులు అన్నదానం ఏర్పాటు చేశారు. వారసంతలో కూరగాయాలు విక్రయించేందుకు వచ్చే రైతులు, చిరు వ్యాపారుల కోసం ప్రతి గురువారం సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని సభ్యులు తెలిపారు.